క్లుప్తంగా

రేపు రెంజల్ మండల సమావేశం

రెంజల్(బోధన్): మండల కేంద్రంలో రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లోలపు రజని అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, విండో చైర్మన్లులు, అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని కోరారు.

11న ఇసుక నిల్వల వేలం

రెంజల్(బోధన్): పట్టుకున్న ఇసుక నిల్వలను మండల కేంద్రంలో ఈనెల 11న వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నీలా శివారు నుంచి అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్ల ఇసుకను పట్టుకుని తహసీల్ కార్యాలయం వద్ద డంప్ చేయించినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన ఇసుకను బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తికల్గిన వారు వేలంలో పాల్గొనాలని తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న అమరవాజి ప్రవీణ్ కుమార్(55) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. జిల్లా కేంద్రంలో నివాసముండే ప్రవీణ్ కుమార్ సోమవారం ఉదయం తీవ్ర అస్వస్థకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తుండగా గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ట్రై సైకిల్ అందజేత



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని కంఠం గ్రామానికి చెందిన జంగం సిద్ధయ్య దివ్యాంగుడికి అనే వ్యక్తికి ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ట్రై సైకిల్‌ను అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు చిన్న భూమేష్, సంతోష్‌రెడ్డి, సాయి, రవి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం డీటీఎఫ్ (డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) క్యాలెండర్, డైరీని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. సంఘ ప్రతినిధులు రాజన్న, బాలయ్య, రాందాస్, దాసు, బాలరాజు గంగారం రాజేష్ పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసిన తర్వాతనే ఉద్యోగ నియామకాల ప్రకటనలు వెలువరించాలని భారతీయ ఛత్రపతి పూలే జాగృతి అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం 27నుంచి 42శాతానికి రిజర్వేషన్ పెంచిన తర్వాత ఉద్యోగ ప్రకటనలు జారీ చేయాలన్నారు. ఈ విషయమై కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిల్ల శ్రీధర్‌బాబు తీసుకెళ్తామని తెలిపారు. వర్సిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులను నియమించాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్‌లను వెంటనే నియమించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు విగ్నేష్ డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో హెల్త్ సెంటర్‌ను సోమవారం వారు సందర్శించారు. విగ్నేష్ మాట్లాడుతూ.. హెల్త్ సెంటర్‌లో సిబ్బంది, మందులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు పవన్, సతీష్, సాగర్, దినేష్, చిత్రు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌కు వెళ్లేదెలా?



ఆర్మూర్ రైల్వే స్టేషన్



స్టేషన్‌కు వెళ్లే దారిలో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

- గతంలో వర్షాలకు కొట్టుకుపోయిన ఆర్మూర్ రైల్వే స్టేషన్ రోడ్డు
- ఆరు నెలలుగా అవస్థలు పడుతున్న ప్రయాణికులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించే రోడ్డు వర్షాలకు కొట్టుకు పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రైల్వే స్టేషన్ నుంచి ఆర్మూర్ పట్టణానికి చేరుకోవడానికి కాలినడకన ఇబ్బందులు పడుతూ ప్రయాణిస్తున్నారు. అయినా అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం జులైలో కురిసిన భారీ వర్షాలకు స్టేషన్‌కు వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్డును బాగు చేయలేదు. రోడ్డు కొట్టుకుపోవడంతో ప్రయాణికులను రైల్వే స్టేషన్ నుంచి ఆర్మూర్ బస్టాండ్, పెర్కిట్ బస్టాండ్, మామిడిపల్లి కూడలికి చేర్చడానికి ఆటోలు రావడం లేదు. దీంతో స్టేషన్ నుంచి ప్రయాణికులు మామిడిపల్లి జాతీయ రహదారి కూడలి వరకు సామానుతో కాలినడకన వెళ్తూ అవస్థలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు





ఆర్మూర్‌లో 'వికసిత్ భారత్' క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు.. అడ్కాస్‌పల్లిలో..

ఆర్మూర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికి అందించడమే 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' లక్ష్యమని బీజేపీ నాయకులు అన్నారు. పట్టణంలో సోమవారం వారు 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల వివరాలతో రూపొందించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. నాయకులు కంచెట్టిగంగాధర్, బీజేపీ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి, నూతల శ్రీనివాస్ రెడ్డి, ద్యాగ ఉదయ్, అధికారులు పాల్గొన్నారు.

కోటగిరి మండలంలో..

రుద్రూర్: కోటగిరి మండలం దేవునిగుట్టతండా, అడ్కస్‌పల్లి గ్రామాల్లో సోమవారం అధికారులు 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గూర్చి ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి క్యాలెండర్‌లను ఆవిష్కరించారు.అధికారులు మారుతీ, గోవర్ధన్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లో ఆదివారం ఆదివాసి నాయకపోడ్ ఉద్యోగుల సేవా సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా డీఆర్‌డీవో సాయన్న ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఆదివాసి విద్యార్థులు ఉన్నత స్థానంలో స్థిరపడే విధంగా సంఘ సభ్యులు తమ సహాయ సహకారాలు అందించాలన్నారు. పిల్లలందరూ చదువుకునే విధంగా తల్లిదండ్రులను చైతన్యవంతులను చేయాలని సూచించారు. నూతన కార్యవర్గాన్ని ఆదివాసి నాయపోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, గౌరవ అధ్యక్షుడు బండారు భోజన్న అభినందించారు. జిల్లా అధ్యక్షుడిగా పుట్ట రాజేశ్వర్, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా నవీన్, ప్రధాన కార్యదర్శిగా కొసెడుగు రవి, మహిళ ఉపాధ్యక్షురాలిగా జీసీడీవో సింగం వనిత, ఉపాధ్యక్షులుగా సురేష్ రు క్మాజి, గంట గంగాధర్, ముఖ్య సలహాదారులుగా కామారెడ్డి డీఆర్‌డీవో సాయన్న, ఐలపూర్ ప్రిన్సిపా ల్ పెద్ది నారాయణ, సోంపేట్ తహసీల్దార్ సురేష్, బీఎస్ఎన్ఎల్ అధికారి తడ్పాకల్ మారుతి ఎన్నికయ్యారు.

విద్యాసంస్థలో సంక్రాంతి సంబురాలు





ఇందూర్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థుల వేషధారణ.. నృత్యం చేస్తున్న విద్యార్థులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్‌లో గల ఇందూర్ ప్రైమరీ పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పాఠశాల ఆవరణలో పల్లె వాతావరణం తలపించేలా ఏర్పాట్లు చేశారు. పొంగల్ తయారు చేసి ముఖ్య అతిథులకు, విద్యార్థులకు పంచారు. హరిదాసు కీర్తనలు, బసవన్న నృత్యాలతో పాటు విద్యార్థులు చేసిన సాంప్రదాయ నృత్యాలు చూపరులను అలరించాయి. ఎంఈవో నాగనాథ్, లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ డిస్ట్రిక్ గవర్నర్ లక్ష్మి, పాఠశాల కరస్పాండెంట్ కోడాలి కిశోర్‌కుమార్ హాజరై, మాట్లాడారు. హెచ్ఎం సుధారాణి, లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ప్రతినిధులు బసవేశ్వర్ రావ్, శ్రీనివాస్‌రావ్, ప్రదీప్‌గుప్తా పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన డాటా ఎంట్రీ



బాల్కొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో ప్రజలు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీ నిర్వహిస్తున్నారు. మండలకేంద్రంలో అధికారులు తీసుకున్న డాటాను సోమవారం మండల పరిషత్ కార్యాలయం, ఎమ్మార్సీ భవనంలో ఎంట్రీ చేస్తున్నారు. షిఫ్టుల ప్రకారం రాత్రి వరకు ఎంట్రీ చేస్తున్నారు. ఆన్‌లైన్ కంప్యూటర్ల కొరత ఉండటంతో కొంతమేర ఇబ్బంది తప్పడం లేదని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కోటగిరిలో ఫుడ్ ఫెస్టివల్

రుద్రూర్: కోటగిరిలోని శ్రీవేద హైస్కూల్లో సోమవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల తినుబండారాలు, స్వీట్లు వంటకాలను తయారు చేసి, పాఠశాలకు తీసుకువచ్చి ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఫెస్టివల్‌కు వచ్చిన వారికి తయారు చేసిన విధానాన్ని వివరించారు. పదార్థాలను విక్రయించారు. కరస్పాండెంట్ అక్షర రవికుమార్, ఉపాధ్యాయులు నిర్మల, రేష్మ, చంద్రకళ, సంగీత, గౌతమి, సంధ్యా, సాయి పవన్, సాయినాథ్, నాగరాజు, రమేష్, షామిలి, శ్రావణి, మాధవి, పూజ ఉన్నారు.



నిజామాబాద్ రూరల్: పై చిత్రంలో కనిపిస్తున్నది పచ్చని పైరు అనుకుంటే పొరబడినట్లే!. మండలంలోని మాధవనగర్ చెరువులో నాచు పేరుకుపోయి, ఇలా చెరువంతా పచ్చని పైరులా కనిపిస్తోంది. ఈ చెరువు చూపరులకు, వాహనదారులకు ఆహ్లాదరకమైన వాతావరణాన్ని కల్పిస్తోంది. అలాగే ప్రమాదం పొంచి ఉంది. దీంతో చెరువులో ఏర్పడ్డ నాచును తొలగించాలని గ్రామస్తులు ఇప్పటికే అధికారులకు విన్నవించినట్లు తెలిసింది.

ఆధార్ సెంటర్లను పెంచాలి



ఖలీల్‌వాడి: జిల్లాలో ఆధార్ సెంటర్ల సంఖ్యను పెంచాలని, మీసేవ కేంద్రాలకు ఆధార్ అప్డేట్ అవకాశం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఆధార్ సెంటర్‌లు తక్కువగా ఉండడం వల్ల ప్రజలు సకాలంలో కార్డులు పొందలేకపోతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఆధార్ సెంటర్లను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయించాలన్నారు. నాయకులు ఓమయ్య, రాజేశ్వర్, రంజిత్, గంగారం, పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కోటగల్లి ప్రభుత్వ పాఠశాలను సోమవారం డీఈవో దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.

నేడు వ్యాసరచన పోటీలు

నిజామాబాద్ సిటీ: స్వామి వివేకానంద జయంతి (జాతీయ యువజన దినోత్సవం) సందర్భంగా నగరంలో నేడు రామకృష్ణ సేవా సమితి, జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో యువతీయువకులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించనున్నట్లు రామకృష్ణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సాయిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని గంగాస్థాన్ 2లో రామకృష్ణ ధ్యాన మందిరం, వివేకానంద ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు వ్యాసరచన పోటీలు, 12న వ్యాసరచన, ఉపన్యాస పోటీలు తెలుగు, ఇంగ్లీష్ భాషలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బస్వా లక్ష్మీనర్సయ్య, బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: దేశంలోని అర్హులైన ప్రతిఒక్కరికి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా చూడటమే 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' ముఖ్య ఉద్దేశమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద సోమవారం ఆయన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా క్యాలెండర్, బ్రోచర్లను ఆవిష్కరించారు. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం బస్వా లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు ప్రజలే అంబాసిడర్లు అని తెలిపారు. 2047 నాటికి భారతదేశం అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలని ప్రధాని నరేంద్రమోదీ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.

విరాళాల డీడీ అందజేత



సిరికొండ: సైనికుల సంక్షేమార్థం సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ఇటీవల సుమారు రూ.50వేల విరాళాలు సేకరించారు. అనంతరం విరాళాలను డీడీ రూపంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు సోమవారం వారు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులను అభినందించారు. అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి, డీఈవో దుర్గాప్రసాద్, ఆర్డీవో రాజేంద్రకుమార్, ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారి రమేష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

సిద్ధులగుట్టపై ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రామాలయం, అయ్యప్ప, దుర్గామాత, హనుమాన్ ఆలయాల్లోనూ భక్తులు పూజలు చేశారు. భక్తభజన మండలి ఆధ్వర్యంలో స్వామి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహించారు. అన్నదాతగా సురజ్, రాధకిషన్ రైస్‌మీల్ యాజమాని వ్యవహరించారు. భక్తులు సుమన్, పీసీ గంగారెడ్డి, బోబిడే గంగాకిషన్, నక్కలక్ష్మణ్, మల్లయ్య, చిన్నారెడ్డి, మీనాచందు, అయ్యప్ప శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు



వర్ని: మండల కేంద్రంలో సోమవారం అయోధ్య రాముల వారి అక్షింతలను హిందూసంఘాల ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. అలాగే మోస్రా మండల కేంద్రంలో గ్రామస్తులు అయోధ్య రాములవారి అక్షింతలకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గ్రామంలో అక్షింతలను పంపిణీ చేశారు.



ఘనంగా సాయి చప్పన్ బోగ్



బాల్కొండ: ముప్కాల్‌లో పడిలేచిన మర్రిచెట్టు ఆవరణలోని సాయిబాబా ఆలయం వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాబాకు భక్తులు 108 రకాల నైవేద్యాలను (చప్పన్ భోగ్)గా సమర్పించారు. అంతకు ముందు ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజల తోపాటు, సాయి పారాయణం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో వైద్యశిబిరం



రుద్రూర్: మండల కేంద్రంలో సోమవారం శ్రీ చైతన్య చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు పలువురు చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. క్యాంపు ఏర్పాటు చేసిన డాక్టర్ నవీన్ కుమార్‌ను ఆలయ కమిటీ, ఆర్యవైశ్య సంఘం సభ్యులు సన్మానించారు. చిదుర వీరేశం, కొలస్ గంగాధర్, మోత్కురి నారాయణ, విజయ్, బచ్చు రాము, వెంకటేశం పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – డెవిల్ (తెలుగు) - 1.05, 7.00; రాఘవరెడ్డి (తెలుగు) - 4.15; సలార్ (హిందీ)- 10.10
- స్క్రీన్-2 – సలార్ (తెలుగు) - 11.00, 2.35, 6.10, 9.45
- స్క్రీన్-3 – హాయ్‌నాన్న- 12.20, 6.45, 10.00, డెవిల్ (తెలుగు) - 3.35

సంక్షిప్తం

యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం


నవీపేట: ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడి విష్ణువర్ధన్‌రెడ్డి ఇటీవల ఎన్నికయ్యారు. ఈసందర్భంగా జనవికాస్ సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి సోమవారం ఆయనను హైదరాబాద్‌లో కలిసి, సన్మానించారు. నాయకులు రామ్‌రెడ్డి, కిరణ్ ఉన్నారు..

శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో సోమవారం శివాజీ విగ్రహ నిర్మాణానికి ఎంపీపీ సామ పద్మ, జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ భూమిపూజ నిర్వహించారు. ఎంపీటీసీ పద్మ, మాజీ జెడ్పీటీసీ జోగు సంగీత, వీడీసీ సభ్యులు ఉల్గొన్నారు.

కోచింగ్ సెంటర్‌పై ఫిర్యాదు



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్‌లోని శ్రీ పవన్ బ్రిలియంట్ పాఠశాలలో అక్రమంగా గురుకుల కోచింగ్ సెంటర్ నిర్వహించడంపై సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రజావాణిలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ద్యాగ శేఖర్ ఫిర్యాదు చేశాడు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రుద్రూర్: పోతంగల్ మండల శివారులోని మంజీరా నది నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు కోటగిరి ఎస్సై సందీప్ సోమవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిఘా ఉంచి, ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. అనంతరం రెవెన్యూ, మైన్స్ అధికారులకు సమాచారం అందించినట్టు ఎస్సై పేర్కొన్నారు.

దుప్పట్ల పంపిణీ



డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని మానవతసదన్ చిన్నారులకు సోమవారం తెలంగాణ ప్రాంతీయ పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షుడు దాసరి నర్సింలు దుప్పట్లు (బ్లాంకెట్లు) పంపిణీ చేశారు. సంఘ నాయకులు భోగ అశోక్, మైసరి నారాయణ, డాక్టర్ కట్టా అశోక్, నల్ల హరికిషన్, చిలుకమారి సంతోష్, మానవత సదన్ కేర్ టేకర్ రమేష్ పాల్గొన్నారు.